

# నాణ్యమైన ఫార్మా కోర్సులకు నైపర్




**సైన్స్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో అంతే స్పీడుతో కొత్త కొత్త వ్యాధులూ పుట్టుకొస్తున్నాయి. వాటి నివారణకు ఔషధాలను కనిపెట్టడం ఎప్పటికప్పుడు సవాలుగా మారుతోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఫార్మా పరిశ్రమ రోజురోజుకీ విస్తరిస్తూనే ఉంది. మనదేశంలో కూడా ఈ పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇందుకు కావాల్సిన నిపుణుల అవసరాలూ పెరుగుతున్నాయి. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జాతీయ ఫార్మాస్యూటికల్ విద్య, పరిశోధన సంస్థలను నెలకొల్పింది. అవి పలు రకాల కోర్సులను అందిస్తున్నాయి. వాటిని పూర్తి చేసినవారి కోసం ఎన్నో ఉద్యోగావకాశాలు ఎదురుచూస్తున్నాయి.**

మనదేశం ఫార్మా పరిశోధనలకు పెద్ద పీట వేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ రిసెర్చ్‌లు ఎక్కువగానే జరుగుతున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల దాదాపు 200కు పైగా ఫార్మా కంపెనీలు ఉన్నాయి. బల్క్‌డ్రగ్‌కు భాగ్యనగరం కీలక కేంద్రం. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న వ్యాక్సీన్లలో సుమారు 33 శాతం ఒక్క హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయి. ఆఫ్రికా దేశాలకు తక్కువ ధరకే వ్యాక్సీన్లను అందిస్తున్న ఘనత కూడా మనదే. ఈ నేపథ్యంలో ఫార్మారంగంలో పెరుగుతున్న ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోడానికి అవసరమైన పలు పీజీ, పీహెచ్‌డీ కోర్సులను ఆఫర్ చేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్) గురించి తెలుసుకుందాం.



జాతీయ ప్రాధాన్య సంస్థగా గుర్తింపు పొందిన నైపర్ వివిధ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీతోపాటు, పీహెచ్‌డీలను కూడా అందిస్తోంది. దీని మొదటి కేంద్రాన్ని పంజాబ్‌లోని మొహాలీలో ఏర్పాటు చేశారు. తర్వాత అహ్మదాబాద్, కోల్‌కతా, గువాహటి, రాయ్‌బరేలీ, హాజీపూర్, హైదరాబాద్‌లలో కూడా ఈ కేంద్రాలను నెలకొల్పారు.

## పీజీలు, పీహెచ్‌డీలు

బయోటెక్నాలజీ, క్లినికల్ రిసెర్చ్, మెడిసినల్ కెమిస్ట్రీ, మెడికల్ డివైజెస్, నేచురల్ ప్రోడక్ట్స్, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (బయోటెక్నాలజీ, ఫార్ములేషన్స్, ప్రాసెస్ కెమిస్ట్రీలలో), ఫార్మాస్యూటిక్స్, ఫార్మాకో ఇన్‌ఫర్మేటిక్స్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ట్రెడిషనల్ మెడిసిన్‌లలో ఎంఎస్ (ఫార్మా), ఎంఫార్మా, ఎంటెక్ (ఫార్మా) డిగ్రీలతో పాటు ఎంబీఏ (ఫార్మా) కూడా అందిస్తోంది.

కెమికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ల నుంచి పది విభాగాల్లో పీహెచ్‌డీలను నైపర్ ఆఫర్ చేస్తోంది.

పీజీలో మెడికల్ కెమిస్ట్రీ కోర్సుకు మాత్రం ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) చేసి సీఎస్ఐఆర్ నెట్ లేదా యూజీసీ నెట్ ఉత్తీర్ణత సాధించాలి. ఫార్మా టెక్నాలజీ పీజీ కోర్సుకు కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి గేట్‌లో క్వాలిఫై కావాలి. మిగతా అన్ని పీజీలకు బీఫార్మసీ ఉత్తీర్ణులైనవారు అర్హులు.

## రెండు స్థాయుల్లో వడపోత

దేశవ్యాప్తంగా ఉన్న ఏడు నైపర్‌ల్లోకి ప్రవేశం కోసం సాధారణంగా ఏటా ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వెలువడుతుంది. జూన్‌లో ఉమ్మడి ప్రవేశపరీక్ష (జేఈఈ)ను నిర్వహిస్తారు. తర్వాత ర్యాంకుల వారీగా అభ్యర్థులు ఎంచుకున్న ప్రాంతంలో సీటు కేటాయించడానికి కౌన్సెలింగ్ జరుగుతుంది. పీహెచ్‌డీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఎం-ఫార్మసీ ఉత్తీర్ణత పొంది నైపర్-జేఈఈలో అర్హత సాధించాలి. అన్ని ప్రోగ్రామ్‌ల అభ్యర్థులు జీప్యాట్, గేట్, నెట్‌ల్లో ఏదో ఒకదానిలో క్వాలిఫై అయి ఉండటం తప్పనిసరి.

అన్ని సంస్థల్లో కలిపి వివిధ కోర్సుల్లో దాదాపు 750 సీట్లు ఉన్నాయి. వాటిలో 134 సీట్లు హైదరాబాద్ క్యాంపస్‌లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా మూడు వేల ఫార్మా విద్యాసంస్థల నుంచి సుమారు లక్షల మంది అభ్యర్థులు జేఈఈకి హాజరవుతారు. రాతపరీక్ష తర్వాత గ్రూప్ డిస్కషన్ లేదా ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ రెండు స్థాయుల్లో వడపోసి చివరికి 750 మందికి పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వ కోటా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ఉంటుంది. మొత్తం అభ్యర్థుల్లో 50-60 శాతం వరకు అమ్మాయిలే ఉండటం విశేషం.

### హైదరాబాద్ నైపర్ ఆఫర్ చేసే కోర్సులు



| కోర్సులు | అంశాలు |
|---|---|
| పీహెచ్‌డీ | మెడికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (ప్రాసెస్ కెమిస్ట్రీ) |
| ఎంఎస్ (ఫార్మా) | మెడికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటక్స్ రెగ్యులేటరీ టాక్సికాలజీ |
| ఎంటెక్ (ఫార్మా) | ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (ప్రాసెస్ కెమిస్ట్రీ) |
| ఎంబీఏ (ఫార్మా) | ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్ |

## అవకాశాలు అపారం

నైపర్‌లో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే కోర్సులు పూర్తి చేసినవారు అమెరికా, న్యూజిలాండ్, స్పెయిన్, లండన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లోని ఫార్మా రంగాల్లో పరిశోధకులుగా, సైంటిస్టులుగా చేస్తున్నారు. ప్రాంగణ నియామకాలు కూడా పెద్దఎత్తున జరుగుతున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, నొవార్టీస్, అబాట్ ఇండియా, సన్ ఫార్మా, జీఎస్‌కే, బయోకాన్, అరబిందో తదితర అనేక ప్రముఖ ఫార్మా కంపెనీలు భారీ ప్యాకేజీలతో ఆఫర్ లెటర్లు అందిస్తున్నాయి. హైదరాబాద్ క్యాంపస్‌కి సంబంధించి గత ఏడేళ్ల నుంచి ఏటా దాదాపు 85 శాతం పైనే ప్రాంగణ నియామకాలకు ఎంపికవుతున్నారు. మిగిలిన వాళ్లు పరిశోధనల వైపు వెళుతున్నారు. ఫార్మసీ విద్యలో హైదరాబాద్ క్యాంపస్‌కు దేశంలోనే తొలి స్థానం దక్కడం విశేషం. కొత్త ఔషధాల పరిశోధనలో ఫార్ములా అభివృద్ధికి సంబంధించి 14 పేటెంట్ హక్కులను హైదరాబాద్ నైపర్ దక్కించుకోవడం విశేషం. వివిధ ఫార్మా కంపెనీలు, జాతీయ, అంతర్జాతీయ ఫార్మా పరిశోధన సంస్థలతో ఈ నైపర్‌కు అవగాహన ఒప్పందాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు ఉన్న ప్రముఖ వ్యక్తులతో అతిథి ఉపన్యాసాలు ఇప్పిస్తుంటారు. 20,773 పుస్తకాలతో కూడిన విశాలమైన గ్రంథాలయం, ఫార్మా పరిశోధనలకు సంబంధించిన రూ. కోట్ల విలువైన అధునాతన పరికరాలతో కూడిన ల్యాబ్, అమ్మాయిలు, అబ్బాయిలకు ప్రత్యేక హాస్టల్ సదుపాయం హైదరాబాద్ క్యాంపస్‌లో అందుబాటులో ఉన్నాయి.

## ప్రతి విద్యార్థికీ ఫెలోషిప్

నైపర్‌లో సీటు పొందిన ప్రతి విద్యార్థికీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఫెలోషిప్ అందుతుంది. పీజీ కోర్సుల్లో చేరేవారికి రెండేళ్లపాటు నెలకు రూ. 12,400, పీహెచ్‌డీ అభ్యర్థులకు అయిదేళ్లపాటు నెలకు రూ. 28,500 అందిస్తారు. ఎంబీఏ (ఫార్మా) కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఎలాంటి ఫెలోషిప్ ఉండదు.

విద్యార్థులు సెమిస్టర్లవారీగా కోర్సు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. వివిధ పీజీ కోర్సులకు సంబంధించి నాలుగు సెమిస్టర్లకు రూ. 1,08,088 (ఎస్సీ, ఎస్టీలకు రూ. 44,200); ఎంబీఏ (ఫార్మా) కోర్సుకు రూ. 3,10,400 (ఎస్సీ, ఎస్టీలకు రూ. 45,700) ఫీజుగా నిర్ణయించారు. పీహెచ్‌డీ కోర్సుల్లో చేరే వారు నాలుగు సెమిస్టర్లకు రూ. 1,09,588 (ఎస్సీ, ఎస్టీలకు రూ. 48,700) చెల్లించాలి. అయిదేళ్ల వరకు పరిశోధన సాగించవచ్చు. విడతలవారీగా కోర్సు ఫీజులు చెల్లించే అవకాశం ఉంది. ఆర్థిక స్తోమతలేని అభ్యర్థులు బ్యాంకు రుణాలు పొందే వీలుంది.

### మరిన్ని వివరాలకు...

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్), బాలానగర్, హైదరాబాద్-500037, తెలంగాణ. ఫోన్- 040-23073741, 23073740, ఫ్యాక్స్-040-23073751,
**ఈ-మెయిల్:** projectdirector@niper-hyd.ac.in
**వెబ్‌సైట్:** www.niperhyd.ac.in

అయిదారేళ్లుగా తెలుగు రాష్ట్రాల నుంచి ఈ కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మొహాలీ, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో మాత్రమే ఎంబీఏ (ఫార్మా) అందుబాటులో ఉంది. మొత్తం కోర్సుల్లో 40 శాతం థియరీకి, మిగతా 60 శాతం ప్రాక్టికల్స్, ఇంటర్న్‌షిప్‌లకు కేటాయించారు.

● *గొర్లె బాలకృష్ణ,* ఈనాడు, హైదరాబాద్

# Flipping through the pages అంటే?

## English Language Skills

**పేపర్ లేదా మ్యాగజీన్‌ను మన చేతుల్లోకి తీసుకున్నపుడు ఒక్కో పేజీని చదువుతూవెళ్లం. క్షుణ్ణంగా చదవటానికి ముందు ఓసారి పేజీలను తిరగేస్తాం. ఈ వ్యక్తీకరణను సమర్థంగా చెప్పే Phrasal Verb ఏమిటో తెలుసా? దాన్ని ఉదాహరణలతో నేర్చుకుందాం!**

**Venkatesh:** What are you doing, Nataraj? (ఏం చేస్తున్నావ్ నటరాజ్?)

**Nataraj:** Just flipping through the magazine, for I have nothing better to do (ఈ మేగజీన్ పేజీలను తిరగేస్తున్నా, అంతకన్నా మెరుగైన పనేమీ లేదు కాబట్టి).

**Venkatesh:** I heard that you and Krishna had a heated exchange yesterday. Is that true? (నిన్న నీకూ, కృష్ణకూ చాలా తీవ్రంగా వివాదం జరిగిందని విన్నాను. నిజమేనా?)

**Nataraj:** He was finding fault with me for nothing, and I had to bite back (నేనేం చేయనప్పటికీ నన్ను తను తప్పు పట్టాడు. అందుకని నేనూ ఘాటుగా సమాధానం ఇచ్చా).

**Venkatesh:** He is always like that, trying to pick holes in the behaviour of some one or the other (అతనెప్పుడూ అంతే, ఇతరుల్లో ఏదో ఒక తప్పు పడుతూనే ఉంటాడు).

**Nataraj:** I do not know when he will improve, and if he will improve at all (అతనెప్పుడు మెరుగవుతాడో తెలీడం లేదు నాకు, అసలు తప్పులు పట్టడం నుంచి బయటపడతాడా అని కూడా నాకు సందేహమే).


ఎం. సురేశన్

**Venkatesh:** OK, let us leave that alone. Are we leaving for Hyderabad tomorrow? (సరేలే, వాడిని వదిలెయ్. రేపు మనం హైదరాబాద్‌కు వెళ్తున్నామా?)

**Nataraj:** Yea, I am ready. We should head off at 6 in the morning tomorrow, promptly. Otherwise we are sure to miss the opportunity (అవును. నేను సిద్ధంగానే ఉన్నాను. రేపు మనం ఆరింటికల్లా బయల్దేరాలి, ఆలస్యం చేయకుండా. లేకపోతే మనం ఆ అవకాశాన్ని కోల్పోతాం).

**Venkatesh:** Just give me a call, and I will at your door step (నాకోసారి ఫోన్ చేయి, నీ తలుపు ముంగిట ఉంటాను).



### Look at the following phrasal verbs from the conversation:

**1) Flip through a magazine =** Look for a short while at the pages of the magazine (Without reading it thoroughly) (అంత క్షుణ్ణంగా చదవకుండా ఏదైనా సంచిక పుటలు తిప్పుతూ ఉండటం).

**a) Prabhakar:** What happened yesterday? I heard that some thieves entered your place (నిన్న ఏం జరిగింది? మీ ఇంట్లో దొంగలు పడ్డారని విన్నాను).

**Sukumar:** Alone at home, I was flipping through the pages of story book, when I heard a sudden noise. I became alert and phoned the police, but the thieves by then had escaped. Nothing stolen, fortunately (ఒంటరిగా ఇంట్లో ఉండి, ఏదో కథల పుస్తకం పేజీలు తిరగేస్తున్నా. ఇంతలో ఉన్నట్టుండి శబ్దం వినపడింది. నేను కాస్త చురుకుగా పోలీసులకు ఫోన్ చేశా. అప్పటికే దొంగలు పారిపోయారు. అదృష్టవశాత్తూ ఏం దొంగిలించలేదు).

**b) Sudha:** I had nothing to do yesterday, it being a holiday. I whiled away my time looking through a cookery book (నిన్న సెలవవడం వల్ల ఏం చేయడానికీ పాలుపోలేదు. ఏదో వంటల పుస్తకం తిరగేస్తూ కాలం గడిపేశా).

**Nalini:** Did you learn anything, or did you just flipped through the pages of the book? (ఏమైనా నేర్చుకున్నావా లేదా ఊరికనే పేజీలు తిరగేశావా?)

**2) Bite back =** Do something bad to others because they have done bad to you (మనకు కీడు చేసినవాళ్లకు మనం కీడు చేయడం).

**a) Sudhakar:** For no fault of mine, he abused me in a very bad language (నేనేం తప్పు చేయకుండానే నన్ను తను బూతులు తిట్టాడు).

**Nikhil:** You should have bitten back him. He takes pleasure in hurting others' feelings (అతన్ని నువ్వు కూడా దూషించి ఉండాల్సింది. అతనికి ఇతరుల భావాలను దెబ్బతీయడం ఒక సరదా).

**b) Chalam:** Seshachalam is quite harmless. Even if others hurt him, he stays quiet and smiles (శేషాచలం కీడు చేసే రకం కాదు. ఇతరులు అతన్ని బాధించినా ఊరికనే ఉంటాడు, చిరునవ్వు చిందిస్తాడు).

**Sekhar:** Yea, so he is. But I don't know why he does not bite back at others when they insult him (అవును, అతనంతే. కానీ నాకర్థం కానిది ఇతరులు తనను అవమానించినప్పుడు, ఎందుకతను వాళ్లను తిరిగి తిట్టడని).

**3) Head off =** Start a journey or leave a place (ప్రయాణానికి బయల్దేరడం).

**a) Balaram:** Jayaram is not yet here. Why is he so unpunctual? (జయరాం ఇక్కడ లేడు. అతనెప్పుడూ ఎందుకు ఆలస్యం చేస్తాడు?)

**Vishnu:** He had phoned me that he was heading off in the morning itself. I don't know the reason why he hasn't been here still (నాకతను ఫోన్ చేశాడు, తాను పొద్దున్నే బయల్దేరతానని. ఇంకా ఇక్కడ ఉండకపోవడానికి కారణమేంటో నాకు తెలీడం లేదు).

**b) Subbarao:** Dinakar is always late. He never arrives at a place promptly (దినకర్ ఎప్పుడూ ఆలస్యమే. సరైన సమయానికి ఎక్కడికీ ఎప్పుడూ రాడు).

**Mallesh:** That is always the trouble with him. He promises to head off at the proper time, but delays it somehow or the other (ఎప్పుడూ అతనితో అదే చిక్కు. సరైన సమయానికి బయల్దేరి వస్తానని చెబుతాడు కానీ, ఏదోవిధంగా ఆలస్యం చేస్తాడు).

# లైబ్రరీ

కాంపిటీటివ్ ఎగ్జామ్స్, అకడమిక్, ప్రవేశపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటీవల మార్కెట్‌లోకి విడుదలైన పుస్తకాల వివరాలు.



### పదోతరగతి

1) టీఎస్- ఆల్ ఇన్ వన్ - సీసీఈ మోడల్ క్వశ్చన్స్; తెలుగులో- పేజీలు: 762 + 634, ధర: రూ.342 ఇంగ్లిష్‌లో - పేజీలు: 760 + 620, ధర: రూ. 378 వీటితో పాటు ఆల్ ఇన్ వన్ - ప్రీవియస్ పబ్లిక్ పేపర్స్ ఉచితం.
ప్రచురణ: వీజీఎస్ పబ్లిషర్స్

### ఆర్ఆర్‌బీ

జనరల్ అవేర్‌నెస్ ఆన్ కరెంట్ అఫైర్స్
పేజీలు: 96, రూ. 60
ప్రచురణ: ఉద్యోగ సోపానం



# నోటీస్ బోర్డు

## ప్రభుత్వ ఉద్యోగాలు

### ఎన్‌పీసీఐఎల్, ముంబయి

సంస్థ: భారత అణుశక్తి విభాగానికి చెందిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్), ముంబయి. **పోస్టు:** మెడికల్ ఆఫీసర్

**ఖాళీలు:** 16 **అర్హత, వయసు, ఎంపిక:** నిబంధనల ప్రకారం.

**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 21.03.2018 నుంచి 19.04.2018 వరకు

**వెబ్‌సైట్:** https://npcilcareers.co.in/

### కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్

**పోస్టులు:** సేఫ్టీ అసిస్టెంట్ తదితరాలు. **ఖాళీలు:** 08 **అర్హత:** పదోతరగతితోపాటు ఇండస్ట్రియల్ సేఫ్టీలో ఏడాది డిప్లొమా, పీజీ. **ఎంపిక:** ప్రాక్టికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.

**దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 19.03.2018 **హార్డ్ కాపీలను పంపడానికి చివరితేది:** 23.03.2018 **వెబ్‌సైట్:** http://www.cochinshipyard.com/

## ప్రవేశాలు

### జిప్‌మర్, పుదుచ్చేరిలో ఎంబీబీఎస్ ప్రవేశాలు

**కోర్సు కాలవ్యవధి:** 4 సంవత్సరాల 6 నెలలు, ఏడాది ఇంటర్న్‌షిప్.

**మొత్తం సీట్ల సంఖ్య:** 200 (జిప్‌మర్ పుదుచ్చేరి-150, జిప్‌మర్ కరైకాల్-50)

**అర్హత:** ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/ బయోటెక్నాలజీ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత. **వయసు:** 31.12.2018 నాటికి 17 సంవత్సరాలు నిండి ఉండాలి. **రాతపరీక్ష తేది:** 03.06.2018 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 13.04.2018

**వెబ్‌సైట్:** http://jipmer.puducherry.gov.in/

## వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

### ఐకార్ - ఐఐఓపీఆర్

**పోస్టులు:** యంగ్ ప్రొఫెషనల్-01, అకౌంట్స్ అసిస్టెంట్-01

**అర్హత, వయసు:** ఐఐఓపీఆర్ నిబంధనల ప్రకారం.

**ఇంటర్వ్యూ తేది:** 20.03.2018 **వేదిక:** ఐకార్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రిసెర్చ్ (ఐఐఓపీఆర్), పెదవేగి, పశ్చిమ గోదావరి జిల్లా, ఏపీ.

**వెబ్‌సైట్:** http://dopr.gov.in/

### మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్, హైదరాబాద్

**పోస్టు:** ట్రేడ్ అప్రెంటిస్ **ఖాళీలు:** 40 **కాలవ్యవధి:** ఒక ఏడాది **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ. **ఇంటర్వ్యూ తేది:** 12.03.2018 **వేదిక:** ఏఎంటీఎల్ బిల్డింగ్-మిధాని (డీఎంఆర్ఎల్ దగ్గర).

**వెబ్‌సైట్:** http://midhani.gov.in/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**